పేదలకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు : ఎంఎల్ఎ

తణుకు: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం కీళ్లు, వెన్నుపూస వ్యాధులకు సంబంధించి ఒపి విభాగాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. గతంలో తాను ఎంఎల్ఎగా ఉన్న 2014-19 మధ్య కాలంలో లయన్స్ సహకారంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పరిధి పెంచేందుకు మరో అయిదు డయాలసిస్ పరికరాలు అందుబాటులోకి తీసకురానున్నట్లు తెలిపారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం సుమారు 600 వరకు ఒపి వస్తున్నారని తెలిపారు. ఇందుకోసం కంటి సంబంధిత వ్యాధులకు సంబంధించి శస్త్రచికిత్సలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, టిడిపి తణుకు పట్టణ ఉపాధ్యక్షులు వంటెద్దు రాజా పాల్గొన్నారు.

అన్నదాతకు 'కూటమి' వంచన..!

- జిల్లాలో 80 శాతం సాగులో కౌలురైతులే
- భూ యజమానులకే అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ
- రెండు విడతలు సొమ్ము జమచేసినా కౌలురైతులకు అందని వైనం
- రెండు జిల్లాల్లో రూ.175 కోట్లు భూ యజమానుల ఖాతాల్లోనే
- ప్రభుత్వం కౌలు కార్డులిచ్చినా లక్షా 40 వేల మందికి మొండిచేయి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ అన్నదాతను తీవ్రంగా వంచించిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర ఏళ్ల దాటింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల పెట్టుబడి సాయం జమ చేసినా అందులో ఒక్క కౌలురైతు కూడా లేని పరిస్థితి నెలకొంది. సాగు చేసే రైతుకు కాకుండా వ్యాపారాలు చేసుకుంటున్న భూయజమానుల ఖాతాల్లో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. అక్టోబర్‌లో కౌలు రైతులకు పెట్టుబడి సాయం జమచేస్తామని మొదటి విడత సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. రెండో విడతలోనూ కౌలు రైతులకు మొండిచేయి చూపించింది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు వేస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. కౌలురైతుకు సైతం పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతులను పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కింద అందించే రెండో విడత సొమ్ములను ప్రభుత్వం బుధవారం జమ చేసింది. ఏలూరు జిల్లాలో 1,60,968 మంది రైతులకు మొత్తం రూ.106.23 కోట్లు జమచేస్తుండగా, అన్నదాత సుఖీభవ కింద రూ.80.48 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.25.75 కోట్లు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,03,761 మంది రైతులకు రూ.68.97 కోట్లు జమ చేస్తుండగా అన్నదాత సుఖీభవ కింద రూ.51.88 కోట్లు, పిఎం కిసాన్ కింద రూ.17.09 కోట్లు జమకానున్నాయి. తొలివిడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేలు, కేంద్రం రూ.రెండు వేలు చొప్పున ఇచ్చింది. రెండో విడతలోనూ అదేవిధంగా సొమ్ములు విడుదల చేసిన పరిస్థితి. మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.నాలుగు వేలు, కేంద్రం నుంచి రూ. రెండు వేలు జమకానున్నాయి.

కౌలు రైతులకు అక్టోబర్‌లో ఇస్తామంటూ మాయమాటలు

తొలివిడత అన్నదాత సుఖీభవ సొమ్ములను ఆగస్టు నెలలో ప్రభుత్వం రైతులకు జమచేసింది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కౌలు కార్డుల ప్రక్రియ పూర్తిచేసి అక్టోబర్‌లో రెండో విడత సందర్భంగా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. రెండో విడత సందర్భంగా కౌలు రైతులను పూర్తిగా పక్కకు పెట్టేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. కానీ ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని 62 వేల మందికి కౌలుకార్డులు జారీ చేయడం జరిగింది. పశ్చిమలో లక్షా ఐదు వేలు కౌలుకార్డులు మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకోగా 80 వేల వరకూ కౌలు కార్డులు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు లక్షా 40 వేల మందికి కౌలు కార్డులు అందించిన పరిస్థితి ఉంది. కౌలుకార్డులు జారీచేసిన తర్వాత కూడా అన్నదాత సుఖీభవ సొమ్ములను ప్రభుత్వం కౌలురైతులకు అందించలేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా కౌలురైతు కుటుంబాలు ఉన్నాయి. ఏటా కౌలురైతులు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. బీమా, పంట నష్టపరిహారంతో సహా భూయజమానులకే ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తాము అధికారంలోకి వస్తే కౌలుచట్టంలో మార్పులు చేసి ఆదుకుంటామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో తెగ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక మాత్రం కౌలురైతులను పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను మోసం చేయడంతో 2024 ఎన్నికల్లో అంతా కూటమి పార్టీ నేతలకు ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం సైతం మోసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. 2029లో కౌలురైతుల ఆగ్రహాన్ని కూటమి సర్కార్ సైతం చవిచూడక తప్పదని చెప్పొచ్చు.



చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ నాగరాణి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి

రెండో విడత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ విడుదల

జిల్లాలో 1,03,761 మంది రైతుల ఖాతాల్లో రూ 68.97 కోట్లు జమ

ప్రజాశక్తి - వీరవాసరం

రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రాయకుదురులో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 1,03,761 మంది రైతుల ఖాతాల్లో రెండో విడత రూ.68.97 కోట్లు జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 19,175 మంది రైతులకు రూ.13.30 కోట్లు, భీమవరంలో 8,335 మందికి రూ.5.68 కోట్లు, నరసాపురంలో 11,965 మందికి రూ.7.63 కోట్లు, పాలకొల్లులో 14,458 మందికి రూ.8.91 కోట్లు, తాడేపల్లిగూడెంలో 18,361 మందికి రూ.12.14 కోట్లు, తణుకులో 16,854 మందికి రూ.11.51 కోట్లు, ఉండిలో 9,629 మందికి రూ.6.61 కోట్లు, గణపవరం మండలంలో 4,884 మందికి రూ.3.19 కోట్లు మొత్తం జిల్లాలో 1,03,761 మంది రైతులకు రూ.68.97 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయన్నారు. ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ.2 వేలు, రాష్ట్రం వాటా రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. భీమవరం నియోజకవర్గంలో రెండో విడతలో 8,335 మంది రైతులకు రూ 5.68 కోట్లు జామ కానున్నాయని, కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరే ప్రభుత్వమని అన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత 46,87,838 మంది రైతులకు రూ.3,135 కోట్లు ప్రభుత్వం అందిస్తుందని, ఇది రైతులకు మరో అతి పెద్ద పండుగ అని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావోయిస్టులకు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసులు మంగళవారం మధ్యాహ్నం ఏలూరు గ్రీన్ సిటీలో అదుపులోకి తీసుకున్న 15 మంది మావోయిస్టులను బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపర్చారు. వారికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని గ్రీన్ సిటీలో గత పది రోజులుగా నివాసం ఉంటున్న మావోయిస్టులను జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు, గ్రేహౌండ్స్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. వారిని నగరంలోని రహస్య ప్రాంతానికి తరలించి విచారించారు. బుధవారం ఉదయం విజయవాడలో ఉన్నతాధికారుల ఎదుట హాజరుపర్చి అనంతరం జిల్లా ఎస్‌పి కార్యాలయం సమీపంలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ప్రభుత్వ వైద్యులను అక్కడికే రప్పించి వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మొబైల్ కోర్టులో హాజరు పర్చారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అంతా ఛతీష్‌ఘడ్‌కు చెందిన వారిగా గుర్తించారు. వీరంతా సుఖ్మా, బీజాపూర్ జిల్లాలకు చెందినవారు. వీరంతా హిడ్మా దళంలో కీలక నేతలుగా ఉన్నట్లు గుర్తించారు. సోడె లచ్చు అలియాస్ గోపాల్, సోడె లక్ష్మీ అలియాస్ భీమ, గంగి లక్ష్మి అలియాస్ మాదే, వెట్టి వెంకట్, పుడకం పగ, కాశ్యప్ భీష అలియాస్ యోగేష్, పొడియం ఆనంద్ అలియాస్ దస్సు, పుడకం లక్ష్మణ్ అలియాస్ కోసా, కుంజుం బుజ్జి, తాటి కమల, దూడి ఆదపు అలియాస్ మల్లేష్, మాదవి జోగ, మాధవి సునీత, కుంజం నందిని, బదిన రాజును ఏలూరు జిల్లా పోలీసులు కోర్టుకు హాజరుపర్చారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఇవే..

మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, నగదును ఏలూరు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రివాల్వర్లు 2, డబుల్ బ్యారెల్ బోర్ గన్ 1, కంట్రీమేడ్ సింగిల్ బ్యారెల్ గన్‌లు 11, తపంచా 1, 132 రౌండ్ల బుల్లెట్లు, రూ.2.80 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఏలూరు గ్రీన్ సిటీలోని ఓ ఇంట్లో 15 మంది మావోయిస్టులు ఉంటున్నట్లు పక్కా సమాచారంతో ప్రజలకు ఎలాంటి భయం, ఇబ్బంది లేకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ అదుపులోకి తీసుకున్నామన్నారు. ఏలూరులో పట్టుబడిన వారిలో మావోయిస్టు కీలక నేతలు ఉన్నారనీ, హిడ్మాతో కలిసి అనేక దాడుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఇంటిని అద్దెకు ఇచ్చిన వారిని విచారించామని తెలిపారు. అద్దెలకు ఇళ్లు ఇచ్చే వారు ఆధార్, పూర్తి వివరాలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

ఉక్కు కార్మికులపై సిఎం వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన నేతల నిరసన

ప్రజాశక్తి - ఆచంట

విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా.గోపాలన్ అన్నారు. ఈ మేరకు బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆచంట మార్కెట్ వద్ద ఉన్న దిగుపాటి ప్రకాష్‌రావు స్తూపం వద్ద నిరసన తెలిపారు. ముందుగా సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమను వైట్ ఎలిఫెంట్ అని, కార్మికులు పనిచేయని దొంగలని వారిపై పీడీ యాక్టులు పెడతామని హెచ్చరించడం హేయమైన చర్య అన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర వనరులను దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్లో పెద్ద ఎత్తున కార్మికులను తొలగించారన్నారు. దేశ సంపద దోచుకునే కార్పొరేట్ శక్తులకు విశాఖ ఉక్కును కట్టబెట్టేందుకు తహతహలాడుతున్నారని, కష్టపడి శ్రమటోర్చి పనిచేస్తున్న కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు పారేసుకోవడం దుర్మార్గపు చర్య అని దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, మన్నే బ్రహ్మయ్య, కేక నాగ ఆంజనేయులు, దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఆర్.దేవదానం, సత్యవతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేతా గోపాలన్

రామకృష్ణ మఠం సాయం మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి - నరసాపురం

రామకృష్ణ మఠం సేవా దృక్పథంతో వంద మంది తీర ప్రాంత మత్స్యకారుల జీవన అభివృద్ధికి చేసిన సహాయం మరువలేనిదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పెదమైనవాని లంక డిజిటల్ కమ్యూనిటీ సెంటర్లో రామకృష్ణ మఠం మిషన్ ఆధ్వర్యంలో మత్స్యకారుల జీవన అభివృద్ధి కోసం పేద మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాజమండ్రి రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పేద మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడానికి తోడ్పాటందిస్తున్న రామకృష్ణ మఠం మిషన్ నిర్వాహకులకు తొలుత కలెక్టర్ అభినందనలు తెలిపారు. మొంథా తుపాన్ కారణంగా నరసాపురం తీర ప్రాంతంలో నష్టపోయిన ప్రజలకు సహాయం అందించడానికి రామకృష్ణ మఠం ముందుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోందని, పేద తీర ప్రాంత మత్స్యకారుల భృతికి ఉపయోగపడే ఉపకరణాలను అందించాలని కోరామని తెలిపారు. ఈ మేరకు మొగల్తూరు, నరసాపురం తీర ప్రాంతంలోని వందమంది పేద మత్స్యకారులను మత్స్యశాఖ అధికారుల ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, వారితో నేడు స్వామీజీ సమక్షంలో సమావేశం జరిగినట్లు తెలిపారు. రూ.50 వేల విలువైన పడవ, 20 వేల రూపాయలు విలువ కలిగిన వల ఒక్కొక్క లబ్ధిదారునికి మిషన్ నిధులతో సమకూర్చినట్లు తెలిపారు. రాజమండ్రి రామకృష్ణ మఠం మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ మాట్లాడుతూ సేవ చేయడం ఎంత ముఖ్యమో అది నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం అన్నారు. జిల్లా కలెక్టర్ 300 మంది పేద మత్స్యకారులకు సహాయం చేయాలని కోరారని, మొదటి విడతగా 100 మంది పేద మత్స్యకారులను ఎంపిక చేసి వారికి పడవలు, వలలు అందించడానికి సమావేశం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు మహిళా వసంతరావు, ఆర్‌డిఒ దాసిరాజు, మత్స్యకార సహాయ సంచాలకులు ఎల్ఎల్ఎన్ రాజు, తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఆలయ సమీపంలో చెత్త

అధికారులను నిలదీసిన స్థానికులు

ప్రజాశక్తి - నరసాపురం

పురపాలక సంఘానికి కంపోస్టు యార్డు సమస్య తీరడం లేదు. ఎక్కడ చెత్త వేసినా ప్రజల నుంచి ప్రతిఘటనలు తప్పడం లేదు. బుధవారం మంచినీటి చెరువు వద్ద స్థానికులు ఆందోళనకు దిగారు. మంచినీటి చెరువు, ఆలయ సమీపంలో చెత్త ఎలా వేస్తారంటూ అధికారుల్ని నిలదీశారు. చెత్త కాల్చడం వల్ల స్థానికంగా ఉండలేకపోతున్నామని వాపోయారు. దోమలు, ఈగలతో పాటు వాసన భరించలేకపోతున్నామని మండిపడ్డారు. జన నివాసాల మధ్య చెత్త వేస్తే ఊరుకోమంటూ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. వచ్చిన ట్రాక్టర్లను వెనక్కు మళ్లించారు. దీంతో పట్టణంలోని చాలా వార్డుల్లో చెత్తను శుభ్రం చేయలేదు. ఎన్నో ఏళ్లుగా పురపాలక చెత్త గోదావరి ఒడ్డున వేస్తూ వస్తుంది. ఇటీవల పట్టణానికి చెందిన ఓసూరి ఫణికర్ గోదావరి జలాలను కలుషితం చేస్తున్నారని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీంతో కోర్టు గోదావరి ఒడ్డున డంపింగ్ యార్డును ఖాళీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అప్పటి నుంచి చెత్త పలుచోట్ల వేస్తూ వస్తున్నారు. తాజాగా మరో ప్రదేశం లేకపోవడంతో ఎక్కడ వేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ఆందోళనలో మూర్తి, శ్యామ్, సునీత, రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను అడ్డుకుని ఆందోళన చేస్తున్న స్థానికులు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనుండాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన చేయకుండా సామాజిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాయకుదురులో స్వచ్ఛ భారత్ మిషన్ - స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.15 వేలతో లబ్ధిదారు వనచర్ల లక్ష్మి గృహంలో నిర్మించిన కొత్త మరుగుదొడ్డిని ప్రపంచ టాయిలెట్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన వల్ల ప్రజలు అనేక వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన చేయకపోవడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లను మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కె.శ్రీనివాసరావు, డిఇఇ టి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ వైభావతి, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, సర్పంచి గడ్డం భారతి, లబ్ధిదారు వనచర్ల లక్ష్మి పాల్గొన్నారు.

టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పుల్లా రెడ్డి, హరేరాం

మరో 18 మందితో నూతన కమిటీ ఎన్నిక

ఏడు తీర్మానలు ఆమోదించిన మహాసభ

మొగల్లులో ముగిసిన రైతు సంఘం 23వ మహాసభ

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లులో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న రైతు సంఘం 23 వ జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. దీనిలో భాగంగా జిల్లా నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షులుగా చిర్ల పుల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల హరే రాం, జిల్లా ఉపాధ్యక్షులుగా కిలారి తవిటి నాయుడు, గుత్తుల శ్రీరామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శులుగా తాళ్లూరి హరిహర లక్ష్మణ్, తూటే మార్టిన్ లోధనరన్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 12 మంది సభ్యులు కమిటీ కలిపి మొత్తం 18 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అనంతరం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని పంటలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం 7 తీర్మానాలు మహాసభ ఆమోదించింది.

మహాసభ ఆమోదించిన తీర్మానాలు ఇవే..

ధాన్యం క్వింటాల్‌కు రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి. కేరళ తరహాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి. పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి. పాడి రైతులను ఆదుకోవాలి. సబ్సిడీపై దాణా సరఫరా చేయాలి. గేదెల కొనుగోలుకు లోన్లు ఇవ్వాలి. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానం చేస్తూ ఫార్ములా రూపొందించి ధర ప్రకటించాలి. కంపెనీల మోసాలను అరికట్టాలి. రాష్ట్ర కోకో బోర్డు ఏర్పాటు చేయాలి. పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలి. జిల్లాలో సాగునీటి కాలువలు, మురుగు డ్రెయిన్స్ ప్రక్షాళన చేయాలి. ముంపుకు గురవుతున్న రైతులను, సాగునీరు అందని రైతులను ఆదుకోవాలి. దొంగరావిపాలెం వద్ద ఎత్తిపోతల పథకం వెంటనే పెట్టి శివారు గ్రామాలకు సాగునీరు అందించాలి. కొల్లేరు కాంటూరును ఐదు నుండి మూడుకు కుదించాలి. కొల్లేరు రైతాంగ సమస్యలు పరిష్కరించాలి. ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి. గిట్టుబాటు ధర కల్పించాలి. దళారుల మోసం నుండి ఆక్వా రైతులను రక్షించాలి. కోల్డ్ స్టోరేజ్లను వెంటనే నిర్మించాలి. విద్యుత్తు సబ్సిడీ అందరికీ వచ్చేటట్లుగా చర్యలు తీసుకోవాలి. ఫీడు ధరలు తగ్గించాలి. నాణ్యమైన సీడ్ కోసం యాచరీస్‌పై చర్యలు తీసుకోవాలని ఏడు తీర్మానాలు మహాసభ ఆమోదించిందని తెలిపారు.

పుల్లారెడ్డి, హరేరాం

యుటిఎఫ్ మాజీ మండల కార్యదర్శి వెంకట నరసింహరాజు మృతి

యలమంచిలి: యుటిఎఫ్ మాజీ మండల కార్యదర్శి మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన పొత్తూరి వెంకట నరసింహరాజు(87) బుధవారం నేరేడుమిల్లి గ్రామంలో ఆయన కుమార్తె ఇంటి వద్ద వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరసింహరాజు మృతి వార్త తెలుసుకున్న యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి సరిపల్లి జయప్రభ, యుటిఎఫ్ పూర్వ మండల అధ్యక్షులు దేవ సుధాకర్, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, మండల నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్‌లు నరసింహారాజు భౌతికాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింహారాజు యుటిఎఫ్ శాఖ మొదటి మండల కార్యదర్శిగా సంఘవిస్తరనకు ఎంతగానో కృషి చేశారని, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి ఉపాధ్యాయ సంఘాన్ని బలోపేతం చేశారన్నారు. అదేవిధంగా ఆయన స్వగ్రామం చించినాడ గ్రామంలో పేదలు, భూస్వాముల మధ్య జరిగిన సమరశీల పోరాటంలో ఆయన పేదల పక్షాన నిలిచి ప్రముఖ పాత్ర వహించారని, ఆ సమయంలో అనేక కేసులు, నిర్బంధాలను ఎదుర్కొని ఆఖరికి జైలు జీవితం గడిపినా.. ఆయన ఎక్కడా వెనకడుగు వేయకుండా కడవరకు పేదల పక్షానే నిలిచి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. వీరి వెంట సిపిఎం నాయకులు శెట్టిమి భాస్కరరావు, మురాల రాజేష్, పల్లేరు వెంకటస్వామి, కేతా శ్రీనివాసు ఉన్నారు



పలువురు సంతాపం

నరసింహరాజు మృతి చెందడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావులతో పాటు యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గుత్తుందీవి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తి నాయుడు సంతాపం తెలిపారు.

వైరల్ జ్వరాల కలకలం

ఇంటింటికీ వెళ్లి శాంపిల్స్ సేకరణ

ప్రజాశక్తి - ఉండి

వైరల్ జ్వరాలతో కలకలం రేపిన మండలంలోని ఉప్పులూరు గ్రామంలో బుధవారం రెండో రోజు యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఐసి కీర్తన ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి బాధితుల శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఒకరోజు అంతకంటే ఎక్కువ రోజులు జ్వరంతో ఎవరైనా బాధపడినట్లయితే వెంటనే దగ్గర్లోని పిహెచ్‌సి సిబ్బందికి సమాచారం అందించాలని, వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్మూలనకు కృషి చేయడానికి వీలవుతుందన్నారు. వైరల్ జ్వరాల వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని వారు సూచించారు. విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని విధిగా స్వీకరించాలన్నారు. అనంతరం ఉండి ఎంపిడిఒ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉదయం నుంచి గ్రామంలో సూపర్ శానిటేషన్ నిర్వహించి డ్రెయినేజీల వద్ద నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోనూ బ్లీచింగ్ చల్లించడం జరిగిందన్నారు. గ్రామంలో పారిశుధ్య సమస్య నివారణకు పంచాయతీ సిబ్బంది కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్ఎన్.మూర్తి, పిహెచ్‌సి సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


శాంపిల్స్ సేకరిస్తున్న సిబ్బంది

జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలకు సూర్యనారాయణ

ప్రజాశక్తి - తణుకు

నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీల్లో మండపాక ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి డిసెంబర్ 13 నుండి 15 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఫణిశ్రీ తెలిపారు. వరుసగా మూడవ సంవత్సరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సూర్య నారాయణను గ్రామ సర్పంచి జాన వెంకటలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరు రామకృష్ణ, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గూడూరు మహాలక్ష్మి అభినందించారు.

చెత్తకు నిప్పు : మంటలు వ్యాప్తి

వాహనదారులు గగ్గోలు

పెనుమంట్రలో..

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు నుండి ఆచంట వెళ్లే ప్రధాన రహదారిలో శ్మశానం వద్ద గుట్టలుగా పోగు పడ్డ చెత్తను తగలబెట్టడం వల్ల వచ్చే మంటలకు, వ్యాపించే పొగకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ చెత్త డంపింగ్ ప్రదేశంలో మంగళవారం రాత్రి ఎగసి పడ్డ మంటలకు, విపరీతంగా అలముకున్న పొగకు ఈ దారిన వెళ్లే అందరూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇదే పరిస్థితి ప్రతీ వారం ఉంటుందని, చెత్త నుండి సంపద సృష్టి అంటూ చెబుతున్న అధికారులు ఆ పని మానేసి, ఇలా చెత్త నుండి మంటలు, పొగ సృష్టిస్తూ ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలతో చెలగాటం ఆడడం తగదని అంతా తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండలంలోని సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకొని, ఇక్కడ చెత్తను తొలగించడం చేయాలని వారంతా కోరుతున్నారు.

మొగల్తూరు : 216 జాతీయ రహదారి పక్కన వేసిన చెత్తకు నిప్పంటించడంతో దాని నుండి వెలువడిన పొగతో వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి నరసాపురం గ్రామీణ మండలం సీతారాంపురంలోని 216 జాతీయ రహదారి పక్కన పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తను డంపు చేశారు. ఈ చెత్తకు సిబ్బంది బుధవారం నిప్పండించడంతో దాని నుండి భారీగా పొగ వెలువడింది. దీంతో రహదారిపై పొగ కమ్ముకోవడంతో ఆ ప్రాంతంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ సిబ్బంది చెత్తను తగలబెట్టడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో వేసిన చెత్తకు నిప్పు పెట్టకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌టిఎ నూతన అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికైన నూతన కార్యవర్గం

మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను తీర్చేందుకు అసోసియేషన్ నిత్యం కృషి చేస్తుందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు తెలిపారు. బుధవారం ఉండి కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ గత సంవత్సరం తమ అసోసియేషన్ ద్వారా చేసిన కార్యక్రమాల గురించి, అసోసియేషన్‌ను బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా గోగులమండ ఎలీషా, అధ్యక్షునిగా పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుబ్బల తేజ వెంకట దినేష్ కుమార్, మండల మహిళా కార్యదర్శిగా బిడిసి కళావతి, కోశాధికారిగా ఎస్.శ్యాం ప్రసాద్, ఎంటిఎస్ కన్వీనర్‌గా వై.వీరభద్రుడు, జిల్లా కార్యదర్శులుగా వి.సాల్మన్ రాజు, సిహెచ్.చిరంజీవిలను ఎన్నుకున్నారు.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు

నరసాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ అమ్మాజీ అధ్యక్షత వహించగా గ్రేడ్-1 లైబ్రేరియన్ కెజెఎస్ఎల్. కుమారి ఆధ్వర్యాన కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి హాజరై మాట్లాడారు. యుకె వనిత క్లబ్ అధ్యక్షులు స్వర్ణలత, మణికర్ణిక, సుధీర్ మోహన్, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన మహిళ దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని కీర్తిశేషులు ఇందిరాగాంధీ జన్మదిన సందర్భంగా జాతీయ మహిళ దినోత్సవం మహిళ సాధికారతపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది జి.శ్రీదేవి, లెక్చరర్ సాయిలక్ష్మి, సోషల్ వర్కర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్టాండ్ మరుగుదొడ్డి

ప్రయాణికుల ఇబ్బంది

ప్రజాశక్తి - పెనుగొండ

శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

పెనుగొండ ఆర్‌టిసి బస్టాండ్‌లో మరుగుదొడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వేలాది మంది గ్రామాల నుండి నగరాలకు, పట్టణాలకు వస్తూ పోతూ ఉంటారు. సామాన్య ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థ ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణికులు తిరుగుతూ ఉంటారు. అక్కడ సరైన మరుగుదొడ్డి లేకపోవడంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరుకోవడం, దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్టాండ్‌కు నిత్యం ఇతర రాష్ట్రాల నుండి పెనుగొండ వాసవీమాత దర్శనానికి వస్తుంటారు. కనీసం బస్టాండ్‌లో కాలకృత్యాలు చేయడానికి సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు అక్కడ ఉండే బస్సుల వెనకకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సరైన మరుగుదొడ్లు కల్పించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే సురక్షితంగా ఉంటారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి మహిళల ఇబ్బందులను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

'చంద్రన్న సంచార చికిత్స'ను వినియోగించుకోవాలి

పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ లీషా

ప్రజాశక్తి - ఉండి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ లీషా అన్నారు. బుధవారం ఉండి ఇరిగేషన్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ లీషా మాట్లాడుతూ ప్రస్తుత శీతాకాలంలో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అవసరమైన ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం సిఫార్సు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇవ్వడం జరిగిందని, గర్భిణులకు ప్రత్యేక వైద్య సదుపాయం అందించడం జరుగుతుందని, అదేవిధంగా మంచం మీద నుంచి లేవలేని రోగులకు వారి ఇంటికి వెళ్లి వైద్యం అందించి తగు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ హెప్సికుమారి, ఎంఎల్‌హెచ్‌పి స్పందన, 104 డిఇఒ రాపాక విజయ్‌కుమార్, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'రైతు భరోసా కేంద్రాలను వినియోగించుకోవాలి'

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు అన్నారు. బుధవారం కొడమంచిలి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు తరలించుకోవాలని, రైతులు ధాన్యాన్ని అమ్మిన 48 గంటల్లో నగదు జమ అవుతుందన్నారు. రైతులు ఎవరి పేరు మీద నమోదు చేయించుకున్నారు వాళ్ల వేలిముద్రలు వేస్తేనే నగదు జమవుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చికిలే శీను, సొసైటీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, కూటమి నాయకులు బండి వెంకటరమణ, చిలుకూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర : రైతు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని పొలమూరులో వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రెండో దఫా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేలు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, త్రి సభ్యులు, నీటి సంఘం అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరరావు, నూర్ భాషా దూదేకుల, కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీజిన్నా, పార్టీ మండల అధ్యక్షుడు వెలగలరామిరెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు పెనుమెత్స వివేక రాఘవేందర్ రాజు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KOTIPALLI RATNA MANIKYAM W/o Kotipalli Kasi Babu, D.No. 6-4-30, Kotipalli vari Street, Narasapuram-534275 W.G.Dt. A.P. I have changed my name from KOTIPALLI RANTA MANIKYAM (Old name) to KOTIPALLI RATNA MANIKYAM (New name) hence forth I am being called KOTIPALLI RATNA MANIKYAM W/o Kotipalli Kasi Babu for all purposes.

CHANGE OF NAME

I, PEKETI RADHA W/o Peketi Pullarao, D.No.1-13-18, Vamsikrishna Nagar, Suryanarayanapuram, Bhimavaram-534202, W.G.Dt. A.P. I have changed my name from PEKETI ANU RADHA (Old name) to PEKETI RADHA (New name) hence forth I am being called PEKETI RADHA W/o Peketi Pullarao, for all purposes.

పాస్‌పోర్టు పోయనది

నేను ది.27-10-2025వ సం॥న మా ఇంటి వద్ద నుండి వట్లూరు రిజిస్టార్ ఆఫీసుకు పని మీద వెళ్ళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు (ఒరిజినల్) మరియు జిరాక్స్ తీసుకుని నా బండి సైడ్ కవరులో పెట్టుకుని వెళ్లుచుండగా సత్రంపాడు దగ్గర చూసుకోగా నా పాస్‌పోర్టు కనబడలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల దయచేసి సంప్రదించగలరు.

Pass port No. F1203395

Date of Issue : 5-1-2005, Place : Vizag

పుసుములూరి ప్రభు చిన్న
S/o.లేటు మురళీకృష్ణ, వయస్సు 42,
R/o.K.V.Hospital, N.R.Peta,
Near New Bus Stand, Eluru.
సెల్: 9963977893.

రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పలుచోట్ల పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమ


తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతుల శ్రేయస్సు కోరుకునేది కూటమి ప్రభుత్వమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండవ విడత సొమ్ములు విడుదల కార్యక్రమాన్ని స్థానిక ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం వెంకటరమన్న గూడెం, కృషి విజ్ఞాన్ కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల కార్మికుల సంక్షేమ సంఘం బోర్డ్ ఛైర్మన్ వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, ఆర్‌డిఒ కౌషర్ భానో, హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. గోవిందరాజులు, రిజిస్ట్రార్ శ్రీనివాసులు పాల్గొన్నారు. సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ నియోజవర్గానికి చెందిన 18.321 రైతుల ఖాతాలకు సంబంధించి 12 కోట్ల పద్నాలుగు లక్షల రూపాయలు నిధులకు సంబంధించి చెక్కును అందజేశారు. కూటమి నాయకులు వర్తనపల్లి కాశి, కృష్ణమోహన్, పద్మనాభం మురళీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సొసైటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: రైతుల మేలుకోరేది కూటమి ప్రభుత్వమేనని 16 నెలల కాలంలో అనేక లబ్ధి చేకూరే కార్యక్రమాలు జరిగాయని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో బుధవారం పాలకొల్లు నియోజకవర్గంలో 14,456 మంది రైతులకు రెండో విడత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కింద 7 వేలు చొప్పున 9.46 కోట్లు బ్యాంకుల్లో జమ అయ్యాయని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, పాలకొల్లు తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, వ్యవసాయ శాఖ పాలకొల్లు ఎడి కేడియం మురళీకృష్ణ, సివిల్ సప్లై డిఎం ఇబ్రహీం, వ్యవసాయ శాఖ ఎఒ రాజశేఖర్, గ్రామ సర్పంచి చొప్పలరజినీ, టిడిపి మండల అధ్యక్షులు పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని మొగల్తూరు సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారకరామారావు అన్నారు. బుధవారం పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవన


నరసాపురంలో..

నిధులు రెండవ విడత విడుదల సందర్భంగా రామన్నపాలెం, మొగల్తూరు ఆర్‌బికెలో రైతులనుద్దేశించి మాట్లాడారు. తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎఒ అబ్దుల్ రహీంలు మాట్లాడుతూ రెండవ విడతగా మండలంలో 3982 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో అన్నదాత సుఖీభవకు రూ.1.99 కోట్లు, పిఎం కిసాన్ సహాయంగా రూ.70 లక్షలు జమచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో రామన్నపాలెం సర్పంచి బందెల ఎలిషా, సొసైటీ డైరక్టర్ కవురు నాగేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవిందరాజులు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

నరసాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. బుధవారం మండలంలోని సారవ గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా రెండో విడతలో రాష్ట్రంలో 46.86 లక్షల మంది రైతులకు రూ.7 వేలు చొప్పున సాయం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, లక్ష్మణేశ్వరం సొసైటీ అధ్యక్షులు పార్థసారథి, ఎడిఎ ప్రసాద్, ఎఒ జ్యోషిలా, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, కైలాష్ సతీస్, గన్నాబత్తుల దుర్గా


తణుకులో..

ప్రసాద్, దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఉండి : రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల విడుదలను వెబ్ కాస్టింగ్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రైతు పంటల పెట్టుబడికి సహాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిధులు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని 3034 మంది రైతులకు రెండు కోట్ల రెండు లక్షల 44 వేల నిధులను వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు : అయిదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులను నిర్లక్ష్యం చేశారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా బుధవారం తణుకు కమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నియోజవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెనుగొండ రూరల్: పెనుగొండ గ్రామం సిద్ధాంతంలో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రెండో విడత రైతులకు నగదు జమ చేయడం రైతుల కళ్లల్లో ఆనందం వస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచులు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోండి

ఆచంట: మండలంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈనెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యాన విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిజిఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్, విశ్రాంతి న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి సాంకేతిక సభ్యులు బి.సులేఖరాణి, ఎస్.సుబ్బారావు హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా లోఓల్టేజ్, మీటర్ మార్పు, బిల్లులు, మీటర్ లోపాలు, సర్వీస్ లోపాలు, విద్యుత్ హెచ్చుతగ్గులు, దీర్ఘకాలంగా పరిష్కారం అవ్వని ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు ఈ వేదికలో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

ఆహారంలో పోషకాలు ఉండాలి

లయన్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం : మనం తినే ఆహారంలో పోషకాలు సమపాళ్లలో ఉండాలని లయన్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. బుధవారం స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో లయన్ బడుగు చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహనా శిబిరం నిర్వహించారు. ప్రతి రోజు మనం తీసుకొనే ఆహారం అన్ని పోషకాలు ఉండాలని ముఖ్యంగా మహిళలు బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. డైమండ్స్ లయన్స్ తరుపున కార్తీక మాసం సందర్భంగా ఎరువులు లేకుండా పండించిన కూరగాయలు, చిరు ధాన్యాలతో కూడిన ఆహారం అందించారు.

వైసిపి యువ నేత రత్నారెడ్డి మృతి

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామ వైసిపి యువ నాయకుడు గుడిమెట్ల రత్నారెడ్డి(33) కామెర్లు సోకి, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. కేటరింగ్ వ్యాపారం చేసే ఆయన కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైసిపిలో చురుకుగా ఉండే రత్నా రెడ్డి చిన్న వయస్సులో మృతి చెందడం పట్ల మండలంలోని పలువురు వైసిపి నాయకులు సంతాపం తెలిపారు.

యడ్ల తాతాజీకి శుభాకాంక్షలు

పాలకొల్లు : డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ వైసిపి రాష్ట్ర సెక్రటరీగా నియమితులైన సందర్భంగా పాలకొల్లు పెయింటింగ్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. పెయింట్ అసోసియేషన్ అధ్యక్షులు నీలం రవి గోపి దుర్గాప్రసాద్, కోరుకొండ సుబ్బారావు, వాకల పూడి బాబ్జి, చలపాటి నాగేంద్ర ప్రసాద్, అందే రాజేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మత్స్య దినోత్సవం

నరసాపురం: ఈనెల 21న పట్టణంలోని హైవే ఇన్ కళ్యాణ మండపంలో మత్స్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మత్స్యకార సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో జరిగే ఈ సదస్సుకు మత్స్యకారులంతా పెద్ద ఎత్తున్న తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ విచ్చేస్తున్నారన్నారు.

బెల్‌వెదర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి

తణుకు: నిబంధనలకు విరుద్ధంగా నాల్గవ అంతస్తు నిర్మిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బెల్‌వెదర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎఐఎస్ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, ఎపి స్టూడెంట్స్ జెఎసి ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి ఆకుల రవి, ఎఐఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.వంశీ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి విద్యార్థి సంఘాల నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల నుండి తణుకులో ఉన్న బెల్‌వెదర్ స్కూల్ యాజమాన్యం 4, 5 అంతస్తు నిర్మిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని తెలిపారు.

అర్ధవరంలో రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి

ప్రజావాణిలో ధర్మరాజును కోరిన చిన్నం చిన నాగేశ్వరరావు

గణపవరం : అర్ధవరం గ్రామంలోని జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కెవిపిఎస్ జిల్లా సహాయకార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి పేటకు వెళ్లే రహదారికి రోడ్డు వేసి మార్జన్ వదిలేశారని అన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కమ్యూనిటీ హాలును నిర్మాణం చేయాలన్నారు. అర్జీ నెంబర్ 455ను కూడా పరిష్కరించాలని కోరారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

పెనుమంట్ర : భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశ ఆర్థికాభివృద్ధికి చేసిన కృషి, ఆమె అందించిన సేవలు గొప్పవని విశ్రాంత తెలుగు రీడర్ రంకిరెడ్డి రామ్మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని నెగ్గిపూడి శివారు వనంపల్లిలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద వారి జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు వారి సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పాలా ప్రసాదరావు, డాక్టర్ ఉన్నమట్ల మునిబాబు, కె.సుబ్రహ్మణ్యం, టి.రాంబాబు, కె.సింహాచలం, జి.కనకరాజు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా పాలకొల్లులో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబం దేశానికి త్యాగం చేసారని పలువురు నివాళులు అర్పించారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి గోగులమండ భాస్కరరావు, పిసిసి సభ్యులు మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

మొగల్తూరు : స్వాతంత్ర సమరంలో బ్రిటీష్ వారిని గడగడలాడించిన వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స రామరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యాన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకుని తమ జీవితంలో వచ్చిన సమస్యలను ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దొంగ శ్రీను, ఎం.రామకృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అన్ని దానాల్లో భూ దానం గొప్పది

సోమేశ్వర స్వామి ఆలయానికి సెంటున్నర స్థలం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్


ఎంఎల్ఎ చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న దాతలు

పంచారామ క్షేత్రమైన భీమవరం శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంకు సెంటున్నర స్థలాన్ని దానం చేయడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సుమారు రూ.44 లక్షలతో రాజమండ్రికి చెందిన గన్నంనేని శివరామకుమార్ సెంటున్నర స్థలాన్ని కొనుగోలు చేసి దేవస్థానంకు స్థలాన్ని అందజేయనున్నారు. దీనిలో భాగంగా బుధవారం కొనుగోలు సొమ్మును ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా దేవస్థానంకు అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషకరమని, సుమారు రూ.లక్ష విలువ కలిగిన స్థలాన్ని దేవస్థానంకు అందిస్తున్న దాతలను ఎంఎల్ఎ అభినందించారు. ఆలయ ఇఒ రామకృష్ణంరాజు, ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు, అర్చకులు రామకృష్ణ మాట్లాడారు. నల్లం చిట్టిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పయనించాలి

శిక్షణ తరగతుల్లో అధికారులు

ఆకివీడు : పంచాయతీలో ఆర్థిక పరిపుష్టి లక్ష్యంగా నిర్వాహకులు ముందుకు సాగాలని ఎండిఒ డి.బాబురావు సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో భాగంగా 5 ఎస్‌జిడి గోల్ క్లీన్ అండ్ గ్రీన్ అంశాలపై మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచ్లు, కార్యదర్శులకు బుధవారం ఎండిఒ కార్యాలయంలో ఒకరోజు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ బాబురావు మాట్లాడుతూ పంచాయతీల ఆర్థిక శక్తిని పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో బ్రౌనింగ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం

ఏలూరు జిల్లా ధర్మాజీగూడెం క్రిసాలిస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 15వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ అండర్-19 బాలబాలికల పోటీలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా పశ్చిమగోదావరి జిల్లా జట్టులో భీమవరం బ్రౌనింగ్ కళాశాల విద్యార్థులు రాణించారు. బాలికల విభాగంలో జి.లిఖిత(ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు), కె.బాలజ్యోతి(ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిషరీస్), ఎన్.వర్షిత లక్ష్మీభద్ర(ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిఇసి) రాణించి పతకాలు సాధించారని బ్రౌనింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.నవీన్ కుమార్ తెలిపారు. చర్చ్ ఆఫ్ క్రెస్ట్ విద్యాసంస్థల సెక్రటరీ మేడిది ఎస్తేరు ప్రియాంక చేతుల మీదుగా పతకాలు గెలిచిన క్రీడాకారులకు మెడల్స్, కప్‌లు అందజేశారు. బ్రౌనింగ్ కళాశాల నుండి కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న అండర్-19 జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఎన్.వర్షిత లక్ష్మీ భద్ర, జి.లిఖితలను, విజేతలను బ్రౌనింగ్ విద్యాసంస్థల ఛైర్మన్ మేడిది జాన్సన్, సెక్రటరీ మేడిది ఎస్తేర్ ప్రియాంక, వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, ప్రిన్సిపల్ కె.నవీన్‌కుమార్, పిడి దావుద్, అధ్యాపక బృందం జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.జయరాజ్ అభినందించారు.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

మొగల్తూరు: గ్రామాల్లోని ప్రజలకు శుద్ధిజలాలు సరఫరా చేసేందుకు వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని బొమ్మిడి సునీల్ నాయకర్ అన్నారు. కాళీపట్నం పడమరలో గ్రామ ఐక్యసంఘం ఆధ్వర్యాన బుధవారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళీపట్నం పడమర సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ సుమారు మూడు లక్షలు వెచ్చించి తీర ప్రాంత గ్రామ ప్రజలకు శుద్ధి జలాలు సరఫరా చేసే వీలుగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను సునీల్ నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న సర్పంచి సావిత్రి ఆదినారాయణను అభినందించారు.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం

భీమవరం: భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టులో ప్రాజెక్టు స్థాయిలో ఉన్న అంగన్వాడీ వర్కర్‌లకు సిడిపిఒ టికెవి లక్ష్మీకాంతం ఆధ్వర్యాన జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు, అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు సమావేశం బుధవారం స్థానిక భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టులో జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ నవంబర్ నెలలో బాలల హక్కుల వారోత్సవాలు ప్రాముఖ్యత గురించి, అలాగే దత్తత మాసోత్సవాలు భాగంగా దత్తత గురించి వివరంగా చెప్పారు. స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీ గురించి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా జిల్లా బాలల సంరక్షణ విభాగపు సంస్థాగత, సంస్థేతర సేవల రక్షణ అధికారులు కౌన్సిలర్స్ పాల్గొన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న సెక్టార్ సూపర్‌వైజర్స్ అందరూ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

మొగల్తూరు : మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కుక్కల వారి తోటలోని ఆదర్శనగర్ కాలనీలో ఉన్న సచివాలయంలోకి మార్చారు. గత కొన్ని సంవత్సరాలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పాతకాలవ సెంటర్ ప్రాంతంలో ఉన్న దయాల్ దాస్ పేటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవన యజమాని ఖాళీ చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు కార్యాలయాన్ని ఖాళీ చేసి తాత్కాలికంగా సచివాలయంలోకి మార్పు చేశారు.

నగర పంచాయితీ కార్యాలయం - చింతలపూడి

ప్రకటన

తేది.18-11-2025

చింతలపూడి నగర పంచాయితీకి సంబంధించిన పాత బస్‌స్టాండ్ నందు గల 11×19 కొలతల గల షాపుకు బహిరంగ వేలం నిర్వహించబడును. అనగా ది.24.11.2025 తేదిన, 3 సం॥ల కాల పరిమితికి గుత్తకు లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు బహిరంగ వేలం నందు పాల్గొనువారు ఈ క్రింది తెలిపిన విధంగా డిపాజిట్లు ముందుగా చెల్లించి, బహిరంగ వేలం నందు పాల్గొనవలెను.

వ.నెం.	గుత్త వివరములు	వేలమునకు ముందు కట్టవలసిన గుడ్ విల్	వేలమునకు ముందు హాజరు పరచవలసిన సాల్వెన్సీ
1.	3 సం॥ల కాలపరిమితి	1,00,000/-	1,00,000/-

సం/- కమీషనర్, చింతలపూడి నగర పంచాయితీ

మహారాజశ్రీ విజయవాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు 4వ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో..
ఓయస్.నెం. 1536/2024

బిట్వీన్
కోడవకొల్లు నాగమల్లేశ్వరరావు
....వాది

మరియు

గోల్వ మల్లేశ్
తండ్రి రామయ్య, వయసు 64 సం॥లు
లైన్‌మేన్, బి.యస్.యన్.యల్, ఎపూరి గ్రామము
ఇంటి నెం. 5-107, నూనెగుండ చెరువు,
హౌస్ ఆఫ్ వాసం సరస్వతి, భర్త (లేట్)సత్యనారాయణ
పెదపాడు మండలం, ఏలూరి జిల్లా.
....ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.12-12-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, అడ్వకేట్ ద్వారా గాని హజరు అయి వారికి అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమందు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది

కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము
వాయిదా తేది: 12-12-2025

ఇట్లు
ఆర్.వి. సుబ్బారావు
పేళ్ళూరి దివాకర్
వాది తరపున న్యాయవాదులు
సెల్ నెం. 9393037788

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 189/2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant

And

Burlu Rama Krishna & Others
...Opponents

Notice to Opponent No. 3

1. Pappala Bhagavan, S/o. Rama Krishna, R/o. Posanapalli, Bhimadole Mandal, West Godavari District.
(Opponent No. 3)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 28-11-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6 -7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on **28-11-2025** at **11-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)
Hearing Date: 28-11-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada